


కరుణాకర్ మెల్లగా అడుగులు వేస్తూ బస్టాండ్ చేరుకున్నాడు మొత్తానికి. ఆ రోజు ఆఫీసులో బాగా లేటయింది. ఓ.టి. చెయ్యాల్సివచ్చింది తప్పనిసరిగా. అది ముగించుకుని బయటపడేసరికి 'పదకొండు గంటలు అయింది' అని చెపుతున్నట్లుగా ఆఫీసులో గోడ గడియారం పురాతనందే అయినా గంటలు కొట్టి మరీ హెచ్చరించింది.

అసలే అది చలికాలం. డిసెంబర్ నెల! మంచు బాగా కురుస్తోంది. చలి వణికిస్తోంది. అదీకాక సిటీకి తన ఆఫీసు ఫాక్టరీ, ఊరి పొలిమేరగా చాలా దూరంలో ఉంది. బస్సు ప్రయాణమే రెండు గంటలు పడుతుంది. కొత్తగా వచ్చిన ఉద్యోగం. బస్సు సదుపాయం సరిగ్గా లేకున్నా, కంపెనీ బస్సుల ఆధారం లేకున్నా, ఓ స్కూటరయినా తన భాగ్యానికి నోచుకోకున్నా తన అవసరాల మేరకి ఓ పది జతల చెప్పులు అరగగా అరగగా దొరికిన ఈ పొలిమేర చిన్న ఉద్యోగమే మహాభాగ్యంగా 'ఉద్యోగం చేయుటం పురుష లక్షణం- అన్నట్లుగా తన మగతనానికి తార్కాణంగా ఆ విధి నియమించిన ఈ ఉద్యోగంలో చేరటం జరిగింది. కొత్తగా చేరటం వల్లో ఏమో, పనితో రుబ్బేస్తున్నారు. పైగా ఓ.టి.లు! ఆలోచిస్తూ బస్సుకోసం ఎంతసేపు నిల్చున్నాడో కూడా గ్రహించుకోలేదు కరుణాకర్.

అటుగా వస్తున్న ఓ ఆటోవాలా అతని ముందు ఆగి "ఏం సార్, బస్సుకోసమా?"

"బస్సుస్టాండ్‌లో నిలబడింది బస్సుకోసం కాక, రైలుకోసమా? వెళ్లు వెళ్లవయ్యా. మహా గొప్ప ప్రశ్న అడిగావు!" అంటూ విసుక్కున్నాడు.

ఆటో అతను పకాలున నవ్వాడు.

"ఏం, ఎందుకు నవ్వుతున్నావు?" కోపంగా అడిగాడు కరుణాకర్.

"ఈ రోజు మధ్యాహ్నం నుంచే బస్సులు బంద్. ఆర్టీసీ సిబ్బంది స్ట్రైక్ ప్రారంభించారు. బస్సులు రావు. అంతేకాదు, ఈ రూట్‌లో ఇంక ఏ ఆటోలూ రావు. నాదే ఆఖరి ఆటో, వస్తా!" అంటూ అతను పొగరుగా వెళ్లిపోతుంటే షాక్ న్యూస్ చెప్పి మరీ ... కరుణాకర్ ఖంగుతిన్నాడు.

అసలే చలి కొరుక్కుతింటోంది. వణికి చస్తున్నాను ఈ రాత్రిపూట 'మంచు కురిసేవేళ' నిక్కుకుపోతే, నేనే చిక్కుకుపోతా. అమ్మో! అని అనుకుని మనసులో. అతన్ని వెనక్కి పిలిచి, "అయితే సిటీకి వస్తావా?" అంటూ అడిగాడు.

"ఎక్కండి. సిటీలో ఎక్కడ దించాలి?"

"తార్నాక."

"సరే, కూర్చోండి!" అంటూ కరుణాకర్ ఎక్కగానే ఆటో స్టార్ట్ చేసి పోనిచ్చాడు రయ్‌మంటూ ఆటోవాలా.

కొంతదూరం వెళ్లగానే మరో బస్టాండ్ వచ్చింది. అక్కడ కూడా ఇలాగే చెప్పి మరో ఇద్దర్ని ఎక్కించుకున్నాడు ఆటో అతను. ఆ పద్ధతేమీ కరుణాకర్‌కి నచ్చలేదు. వద్దని తనకిష్టంలేదని వారించాడు.

"చాల్లెండి, మీరొక్కరిచ్చే కిరాయి ఏ మూలకి నాకు? పెట్రోలు ఖర్చుకే సరిపోదు! ఆటోలో నలుగురు కూర్చోవచ్చు వెనక సర్దుకుని. పోనీలే అని ఇద్దర్నే ఎక్స్ట్రా ఎక్కించాను!" అంటూ వాళ్లిద్దర్నీ ఎక్కించుకుని ఆటో పోనిచ్చాడు. ఆ ఇద్దరూ కరుణాకర్‌ని కోపంగా చూశారు. కావాలని అతన్ని ఇరుగ్గా కూర్చోపెట్టారు.

మరికొంత దూరం పోయేసరికి ఆటోకి అడ్డంగా, ఆ చీకటిలో ఓ ముసలతను నిలబడి చెయ్యి ఊపుతూ మరీ ఆటోని ఆపాడు. చాలా దగ్గుతున్నాడు పాపం.

"ఏం తాతా?" అంటూ అతన్ని పలకరించాడు ఆటోవాలా.

"బాబూ! ముసలాడిని, వణికి చస్తున్నాను. శరీరాన్ని కొరుక్కుతింటున్న ఈ చలి ఒకటి. అసలే రోగిష్టివాడిని. దయవుంచి సిటీవరకు చేర్చు నాయనా! నడిచి వెళ్లలేకపోతున్నాను. కాళ్లు కొంకర్లెత్తుతున్నాయి. నీకు పుణ్యం ఉంటుంది. ఈ ముసలాడి మీద దయవుంచు, బాబూ!" అంటూ ప్రాధేయపడ్డాడు.

ఆటో అతను మాట్లాడేలోపల కరుణాకర్ కలగజేసుకుని "అదేం కుదరదు. ఇప్పటికే నా సవారీతో మరో ఇద్దర్ని ఎక్కించుకున్నావు డబ్బుకాసపడి. ఇంక ఈ ముసలాడిని కూడానా? అదేం కుదరదు. చూస్తూ ఊరుకుంటే సిటీకి చేరేలోపల దారిలో కనిపించిన వాళ్లందర్నీ ఎక్కించుకుపోయేలా ఉన్నావు. నడు, నడు!" అన్నాడు.

"బాబూ! ఈ 'మంచు కురిసేవేళ' ఒంటరిగా ఈ ముసలి రోగిష్టివాడిని ఇలా వదిలేసి వెళ్లిపోవటం న్యాయం కాదు, ధర్మం కాదు! ఈ మంచు నన్ను తినేస్తుంది చంపేస్తుంది. ప్రాణభిక్ష పెట్టించండి బాబూ!"

"నో, వీలు లేదు. నేను పోలీసులకి పట్టిస్తా ఆటోలో ఎక్కువమందిని ఎక్కించుకుంటున్నావని!"




అంటూ బెదిరించాడు కరుణాకర్. దాంతో ఆటో అతను భయపడి, ఏం మాట్లాడక పక్కనుంచి ఆటోని తీసుకుపోయాడు. ఆ తాత ఎంతగా అరుస్తున్నా వెనక్కి రాలేదు మళ్లీ ఆటో. తాత పాపం అరిచి అరిచీ నడవలేక అలా అక్కడే రోడ్డుమీద కుప్పలా కూర్చుండిపోయాడు.

000 000 000

కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటూ కాఫీ తాగుతున్నాడు కరుణాకర్.

"ఏమిట్రా వార్తలు, పొద్దున్నే?" అంటూ తల్లి అడిగింది కూరలు తరుగుకుంటూ.

తల్లికి ఆ వార్తా, ఈ వార్తా చదివి వినిపిస్తూ పక్కపేజీ తిప్పాడు. అక్కడ ఓ హెడ్డింగ్ చూసి కళ్లు అటు తిప్పి చదివాడు. "మంచు మింగిన మరో వ్యక్తి!" అంటూ వివరాలు రాసి, అక్కడ ఫొటో వేసి ఉండటం కూడా చూసి కరుణాకర్ ఖంగుతిన్నాడు. రాత్రి తను వచ్చిన రూటు, తను చూసిన ఆ ముసలివాడు! చలికి బిగుసుకుపోయి అతను అక్కడికక్కడే మంచువాతచే మరణించిన వైనం చదవగానే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఏడుస్తూనే అనుకోకుండా గట్టిగా చదివి తల్లికి వినిపించాడు. తల్లి బాధపడినా అతను ఎందుకు ఏడుస్తున్నాడో అర్థం చేసుకోలేకపోయింది. అతనూ చెప్పలేకపోయాడు, తన తప్పిదాన్ని తన మూర్ఖత్వాన్ని.

"పిచ్చినాయనా, నీ దెంత కరుణ కలిగిన హృదయమో! ఎవరో చనిపోయినా ఏడుస్తున్నావు జాలిపడుతూ!" అంటూ ఆమె లేచి లోపలికెళ్లింది.

'కాదమ్మా, పేరుకే కరుణాకర్‌ని. నాలో ఏమాత్రం కరుణ లేదు. అదే ఉంటే అతను బ్రతికుండేవాడు. నా మూర్ఖత్వం మూలంగానే అతను మంచుదెబ్బ తిన్నాడు!' మనసులోనే అనుకుంటూ ఏడ్చాడు. ఏడవడా మరి? ఎంతటి మనిషికయినా మానవత్వం లోపల దాగి ఉంటుంది. అయితే... మానవత్వం ముందు మూర్ఖత్వమే హెచ్చుస్థాయిలో ఉంటే అది మానవత్వాన్ని, మనిషినీ, మంచితనాన్నీ, జాలినీ, దయనీ అణగదొక్కి మరీ ఇదిగో... ఇలాంటి దారుణాలే చేయిస్తుంది. అందుకే అందరూ ముందుగా మూర్ఖత్వాన్ని అణగార్చి, మానవత్వానికే చోటు పెంచాలి తమ హృదయంలో! లేదా, ఆ తర్వాత కరుణాకర్‌లా ఏడ్చినా ఏం లాభం?

■